ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శనివారం 14 డిసెంబరు 2024



హైకోర్టుకు నలుగురు రెగ్యులర్ న్యాయమూర్తులు

బెంగళూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టుకు నలుగురు రెగ్యులర్ న్యాయమూర్తులను నియమించే ప్రతిపాదనకు సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా నేతృత్వంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. న్యాయమూర్తి జస్టిస్ టీజీ శంకర గౌడ రిటైర్ కానున్నారు. 2023 జనవరి 21న బెంగళూరు సిటీసివిల్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి రామచంద్ర డి హుద్దార, బెంగళూరు గ్రామీణ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి టీజే వెంకటేశ్‌నాయక్, ప్రభుత్వ న్యాయవాది విజయ్ కుమార్ ఏ పాటిల్, రాజేశ్ రై కళ్ళంగళను నియమించనున్నారు.

ఇసుక టన్ను.. రూ. 850


ఇసుక తవ్వకాలు (ఫైల్)

- కొనుగోళ్లలో గందరగోళానికి తెర
- రాష్ట్రవ్యాప్తంగా ఒకే ధర
- పాలసీ 2020 అమల్లోకి
- ఈ-టెండర్ ద్వారా కాంట్రాక్టర్లకు రీచ్‌ల కేటాయింపు

బెంగళూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ బడితే అక్కడ ఇసుక తవ్వడం, ఒక్కో ప్రాంతంలో ఒక్కో ధర ఉండడం తదితర గందరగోళానికి ఇకపై తెర పడనుంది. ఒకే ధర..ఒకే విధానం అమలుతో ఇసుక తరలింపులో అక్రమాలకు చెక్ పెట్టడానికి ప్రభుత్వం నిర్ణయించుకుంది. నిర్మాణరంగంతోపాటు ఇతరత్రా అవసరాలకు సేకరించే ఇసుక కోసం ఎన్నెన్నో సమస్యలు కొనసాగాయి. ఇకపై ఇలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం ఏకరూప విధానాన్ని ప్రవేశపెట్టింది. నదీ తీరంలో ఇసుక సేకరణ అందరికీ వెసలుబాటు కల్పిస్తూ టన్నుకు రూ.850గా నిర్ణయించారు. రాష్ట్రంలో 4, 5 ఉన్నతశ్రేణి ఇసుకరీచ్‌లు, నదులు జలాశయాలు, ఆనకట్టల బ్యాక్‌వాటర్ ప్రాంతాలతోపాటు నదీ పరీవాహకంలో ఇసుక సేకరణ ప్రభుత్వరంగ సంస్థలతోపాటు ప్రజలకు అవకాశం కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త ఇసుక పాలసీ 2020ను అమలులోకి తెచ్చారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరిపి ఇసుకను సమకూర్చేందుకు హట్టి బంగారు గనుల కంపెనీ సంస్థ, కర్ణాటక స్టేట్ మినరల్స్ కార్పొరేషన్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. రెండు సంస్థలు అవసరమైనంత మేర ఇసుకను సేకరించి సమకూర్చడంలో విఫలం చెందాయి. ప్రభుత్వానికి అనుబంధమైన సంస్థల ద్వారా ఇసుక రీచ్‌లను బహిరంగంగా వేలం లేదా టెండరు ద్వారా విభజించి అనుకూలం చేశారు.

గతంలో గ్రామాల్లో టన్నుకు రూ.300

ప్రజలకు, ప్రభుత్వానికి అవసరమైన నిర్మాణాలకు అవసరమైనంత ఇసుకను 1, 2, 3 శ్రేణి రీచ్‌లలో పల్లెల్లో లభించే ఇసుకను గ్రామ పంచాయతీలకు కేటాయించే బాధ్యతను అప్పగించారు. పంచాయతీల ద్వారా కేటాయించే ఇసుక టన్నుకు ధర రూ.300గా ఉండేది. ప్రజలు ఇసుక తవ్వకాలను కాంట్రాక్టు పొందే అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రజలకు అవసరమైనంత ఇసుకను సమకూర్చే ఉద్దేశంతో రీచ్‌లను కేటాయించే బాధ్యత జిల్లా కమిటీలకు అప్పగించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఓకే విధానం

రాష్ట్రవ్యాప్తంగా 'ఒకే విధానం-ఒకే ధరతో ఇసుకను విక్రయించేలా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఈ ఏడాది మే 23న గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ నేతృత్వంలో శాస్త్రవేత్తలతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ వివిధ జిల్లాల్లో పర్యటించి రాష్ట్రవ్యాప్తంగా రూ.900 మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయించవచ్చునని సిఫారసు చేసింది. రాష్ట్రంలో ఇసుక మార్కెట్ ధర, ఇసుక సేకరణకు ఈ-టెండరు ద్వారా రీచ్‌లు కేటాయించే విధానం ప్రభుత్వ అనుబంధ సంస్థలకు మెట్రిక్‌టన్ను రూ.850 చొప్పున విక్రయించేలా గనులశాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి ప్రస్తావనలు పంపారు. అందుకు అనుగుణంగానే ప్రభుత్వం బహిరంగంగా టన్ను ఇసుక రూ.850కు విక్రయించేలా ధర నిర్ణయించింది. 4, 5 ఉన్నతశ్రేణి రీచ్‌లు నదులు, ప్రాజెక్టుల బ్యాక్‌వాటర్, నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇసుక బ్లాక్‌లను కాంట్రాక్టు పద్ధతిన అప్పగించనున్నారు. ఎస్సీలకు 17శాతం, ఎస్టీలకు 7శాతం, దివ్యాంగులకు 5శాతం, మిగిలిన 71శాతం జనరల్ కోటాలో అప్పగించేలా నిర్ణయించారు. జిల్లా ఇసుక కమిటీల దశలోనే ఇసుక రీచ్‌లను గుర్తించి టెండర్లను పిలిచి ఇసుకను నిర్ణీత గడవులోగా సరఫరా చేసే అవకాశం కల్పించారు. టెండరుదారులు ప్రభుత్వానికి ప్రజలకు అవసరమైనంత మేర నిర్ణయించిన ధరలోనే విక్రయించాల్సి ఉంటుంది.


పారదర్శకంగా టెండర్ల కేటాయింపు

ప్రభుత్వం జారీ చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారం గనులశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్, జియాలజిస్టులు గెజిట్ రూపంలో విడుదల చేసిన రీచ్‌లకు మాత్రమే టెండర్లు ఆహ్వానించాలి. 4, 5 ఉన్నతశ్రేణి ప్రదేశాలను తాలూకా ఇసుక కమిటీల సభ్యులతో కలసి పరిశీలన జరిపి నిర్ధారించాలి. టెండర్ల ద్వారా మాత్రమే ఇసుక రీచ్‌లను కేటాయించి జిల్లా ఇసుక కమిటీలకు ప్రస్తావనలు పంపాలి. ఈ ప్రస్తావనలను జిల్లా కమిటీలు పరిశీలించి అవసరమైన మార్పులు చేయాల్సి ఉంటే మరోసారి స్వయంగా తనిఖీలు జరిపి టెండర్ల ద్వారా రీచ్‌లను విభజించి రిజర్వేషన్‌కు అనుగుణంగా కేటాయించాలి. ఇసుక రీచ్‌ల టెండరు ప్రక్రియ ఎక్కడ ఉందనేది ముందస్తుగా నిర్దేశించిన విధానాలకు అనుగుణంగా అమలు చేయాలి. ఒక రీచ్‌కు ఒకరికంటే ఎక్కువమంది బిడ్‌లో పాల్గొంటే జిల్లా ఇసుక కమిటీ లాటరీ ద్వారా ఎంపిక చేయాలి. ఇసుక తవ్వకాలకు ఇంజను బోట్లు, డ్రెడ్జింగ్ యంత్రాల వినియోగాన్ని నిషేధించారు. ఇసుకరీచ్‌లను ఇతరులకు కేటాయించడం నిషేధించారు. ఇసుక రీచ్‌లను వేలంలో పొందిన కాంట్రాక్టర్‌లకు మరో ప్రదేశంలో ఎక్కడా కేటాయించరాదు. ఇసుక తవ్వకాలు నిర్దేశించిన సమయంలోనే చేపట్టాలి. వర్షాకాలం, వరదలు, ప్రకృతి వైపరీత్యాల కాలంతో కలిపి ఐదేళ్లకు మాత్రమే గడువు ఉండాలి. అంతకుమించి కాంట్రాక్టు వ్యవధి ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచరాదు.


భక్తిశ్రద్ధలతో..

హనుమద్ వ్రతం

- అంజన్న ఆలయాల్లో హోమాలు, పూజలు


చౌడసంద్రలో పూజలందుకుంటున్న హనుమంతుడు

రాష్ట్రవ్యాప్తంగా హనుమద్‌వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆకుపూజలు, హోమాలు నిర్వహించారు. హనుమాన్ నామస్మరణ మార్మోగింది.


అంజనాద్రిపై భక్తుల సందడి


7


మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి

అంతర్గత ఫిర్యాదుల కమిటీతో మహిళలకు భద్రత

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి

8



కొండపై చిరుత ప్రత్యక్షం

కంప్లి తాలుకా పరిధిలో శుక్రవారం జిందాల్ ఉద్యోగులకు దరోజీ కొండ పక్కనే ఉన్న బండరాయిపై చిరుత కనిపించడంతో బెంబేలెత్తిపోయారు..

- 8లో

దేవలాపురం, కురేకుప్ప మధ్యలో బండరాయిపై కూర్చున్న చిరుత



8

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

- మహిళను వంచించడంపై బళ్లారి ఎస్పీ ఆగ్రహం

సిరిధాన్యాలతో రోగనిరోధక శక్తి

- తృణధాన్యాల ఉత్పత్తిలో రాష్ట్రానికి దేశంలోనే మూడో స్థానం: సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రోగనిరోధకశక్తి పెంచేందుకు సిరిధాన్యాలు ఎంతో మేలని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. సువర్ణసౌధలో అంతర్జాతీయ సేంద్రియ సిరిధాన్యాల మేళాను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దేశంలో తృణధాన్యాల ఉత్పత్తిలో కర్ణాటక మూడోస్థానంలో ఉందన్నారు. 18.33 లక్షల హెక్టార్లలో 22.16 లక్షల టన్నుల సిరిధాన్యాలు ఉత్పత్తి అవుతాయన్నారు. దేశ విదేశీలలో సిరిధాన్యాలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఈనెల 23ఉంచి బెంగళూరు త్రిపురవాసినిలో అంతర్జాతీయ సిరిధాన్యాల మేళా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్, విధానపరిషత్ సభాపతి బసవరాజహొరట్టి, వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి, మంత్రులు ఈశ్వర్‌ఖండ్రె, బోసరాజు, మాజీ మంత్రి ఆర్‌వీ దేశ్‌పాండే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు పాల్గొన్నారు.

3,988 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతిపాదన

రాష్ట్రంలో కొత్తగా 3,988 అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచేందుకు కేంద్రప్రభుత్వానికి ప్రస్తావనలు పంపామని స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ అభిప్రాయపడ్డారు. విధానపరిషత్‌లో శుక్రవారం సభ్యుడు జవరాయగౌడ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచేందుకు కేంద్రప్రభుత్వ అనుమతులు కావాలన్నారు. లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించే విషయంలో కేంద్రం 20శాతం సమకూరుస్తుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు గౌరవధనం పెంచాలంటే కేంద్రప్రభుత్వం 30శాతం భరించాల్సి ఉంటుందని చర్చలు జరుపుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్రప్రభుత్వం ఆమోదించిన 65,931, రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన 3,988 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. వీటికి కేంద్రప్రభుత్వం నుంచి అదనపు నిధులు కోరామన్నారు. మరో ప్రశ్నకు సమాధానంగా దేవదాసీ మహిళలకు గృహలక్ష్మి అందిస్తామని మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ తెలిపారు. దేవదాసీ మహిళలకు రూ.2వేల పింఛనుతోపాటు రూ.30వేల ఆర్థికసాయంతోపాటు ఇంటిసౌలభ్యం కల్పిస్తామన్నారు. కొప్పళ జిల్లాలో 6,018మంది దేవదాసీలు ఉన్నట్టు సమీక్షలో తేలిందని వీరిలో 2653 మంది ఉన్నారన్నారు. మరోసారి సమీక్ష జరిపి ఎంతమంది ఉండేది స్పష్టం చేస్తామన్నారు.



సువర్ణసౌధలో సిరిధాన్యాల మేళా ప్రారంభంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్


తృణధాన్యాల రైతుల నమూనాతో మంత్రి చలువరాయస్వామి

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ తొలి నివేదిక సమర్పణ

శాసనసభ ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ తొలి నివేదికను శుక్రవారం ప్రభుత్వానికి సమర్పించారు. కమిటీ అధ్యక్షుడు పీఎం నరేంద్రస్వామి సువర్ణసౌధలో మాట్లాడుతూ 14 జిల్లాల్లో 12మంది శాసనసభ్యుల కమిటీ పర్యటించిందన్నారు. ప్రస్తుతం తొలి నివేదిక అందించామని తదుపరి సమగ్ర నివేదిక సమర్పిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారి శ్రేయస్సుకు కట్టుబడి ఉందన్నారు.


పరిషత్‌లో మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్

రూ.5వేల కోట్లతో శాశ్వత ప్రాజెక్టు

బెంగళూరులో అతివృష్టి నియంత్రణకు రూ.5వేల కోట్లతో శాశ్వతమైన ప్రాజెక్టు రూపొందించదలిచామని రెవెన్యూమంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. నగరంలో 856 కిలోమీటర్ల మేర రాజకాలువలు ఉన్నాయని వీటిలో 200 కిలోమీటర్లు చిన్న కాలువలు ఉన్నాయన్నారు. రాజకాలువలను అభివృద్ధి పరచాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.

పట్టణ పంచాయతీలుగా 50 గ్రామాలు

రాష్ట్రంలో 50 గ్రామపంచాయతీలను పట్టణ పంచాయతీలుగా మార్పు చేసేందుకు ప్రతిపాదనలు వచ్చాయని నగరాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేశ్ పేర్కొన్నారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాలవేళ బీజేపీ సభ్యుడు దినకరశెట్టి ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ప్రతిపాదనలను పరిశీలించి అంచెలంచెలుగా పట్టణ పంచాయతీలుగా మారుస్తామన్నారు. 2011 జనాభా ప్రకారం గోకర్ణలో 13,539 మంది ఉన్నారని, 2015 మార్చి 19న 15వేలకంటే ఎక్కువమంది జనాభా కల్గిన పంచాయతీలను మాత్రమే పట్టణ పంచాయతీలుగా మార్చాలని నిబంధన విధించారన్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైనందున పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. బీజేపీ సభ్యుడు విజయేంద్ర మాట్లాడుతూ జనాభా లెక్కలను ప్రస్తుతం పరిశీలిస్తే గోకర్ణను పట్టణ పంచాయతీ చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఇక్కడికి లక్షలాదిమంది భక్తులు వస్తుంటారని, సౌకర్యాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

ఆభరణాల కొనుగోలులో నమ్మకమే ప్రధానం

- రీగల్ జ్యువెలర్స్ ప్రారంభంలో నటి రాధికా పండిట్

బెంగళూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలంటే అందరికీ ఇష్టమేనని వినియోగదారులు నమ్మకానికే ప్రాధాన్యం ఇస్తారని ప్రముఖ శాండల్‌వుడ్ నటి రాధికా పండిట్ అభిప్రాయపడ్డారు. కేరళలో 45 సంవత్సరాల అనుభవం కల్గిన రీగల్ జ్యువెలర్స్ సంస్థ నగరంలోని కమ్మనహళ్ళిలో ఏర్పాటు చేసిన తొలిశాఖను శుక్రవారం ఆమె ప్రారంభించారు. రీగల్ జ్యువెలర్స్ ఎండీ విబిన్‌దాస్, జనరల్ మేనేజర్ గోపాల్, స్టోర్ మేనేజర్ సంతోష్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు. కమ్మనహళ్ళిలో రీగల్ జ్యువెలర్స్ ప్రారంభం పండుగ వాతావరణంలో జరిగింది. నటి రాధికాపండిట్‌ను చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో చేరారు. జ్యోతిప్రజ్వలన చేసి షోరూంను ఆవిష్కరించిన రాధికా పండిట్ మాట్లాడుతూ రీగల్ జ్యువెలర్స్ ఆభరణాల తయారీలో అపార అనుభవం కలిగి ఉందని, నేరుగా వినియోగదారులకు అందించడం ద్వారా హోల్‌సేల్ ధరలతోనే రిటైల్ కస్టమర్లకు ఆభరణాలు లభ్యం కానున్నాయన్నారు. ఎండీ విబిన్‌దాస్ మాట్లాడుతూ 1978లో శివదాస్ థామరస్సెరి ద్వారా స్థాపించబడిన రీగల్ జ్యువెలర్స్ నాణ్యత, నైపుణ్యం ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తూ వచ్చిందన్నారు. ఆధునికశైలి, సంప్రదాయ ఆభరణాల సమ్మిళితం చేసే నైపుణ్యం కల్గిన వృత్తిదారులచే అద్భుతమైన డిజైన్లు మా ప్రత్యేకమన్నారు. కమ్మనహళ్ళిలో శాఖ ఏర్పాటు ద్వారా కేరళ రాష్ట్రం తర్వాత కర్ణాటకలో అడుగు పెట్టామన్నారు. బెంగళూరు భిన్నమైన నగరమని ఇక్కడ దేశ, విదేశీ ప్రజలు నివసిస్తున్నారని అందరి అభిరుచులకు అనుగుణమైన వ్యాపారాలకు ఇదో కేంద్రమన్నారు. ఇక్కడి వాతావరణం, ప్రజల జీవనశైలిని కొనియాడారు. రీగల్ జ్యువెలర్స్ మల్లేశ్వరంలో మరోశాఖను ఏర్పాటు చేసే ఆలోచన ఉన్నట్టు ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. బంగారు, వెండి, డైమండ్ ఆభరణాలు తమ ప్రత్యేకత అన్నారు.



షోరూంను ప్రారంభిస్తున్న నటి రాధికా పండిట్


ఇస్రో వైపు ప్రపంచదేశాల చూపు

- శాస్త్రవేత్త డాక్టర్ టీకే అనురాధ

బెంగళూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) కేవలం డిజిటల్ పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయడమే కాకుండా ప్రపంచ రాజనీతిసంస్థగాను పనిచేస్తోందని తద్వారా ప్రపంచదేశాలు ఇస్రో ప్రయోగాలవైపు చూస్తున్నాయని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ టీకే అనురాధ అభిప్రాయపడ్డారు. నేషనల్ కళాశాలలో సైన్స్ ఇన్ యాక్షన్ విజ్ఞానమేళాను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి శాస్త్రవేత్త అనురాధ మాట్లాడుతూ ఇస్రో ప్రగతిపై ప్రముఖ వ్యక్తులతోపాటు విజ్ఞానసంస్థలు అధ్యయనం చేస్తున్నాయన్నారు. ప్రపంచ రాజనీతి రంగంలోనూ కొత్త ఒరవడితో దూసుకెళ్తోందన్నారు. ఇస్రో రోడ్లు బ్రిడ్జ్‌లు భౌతిక సంబంధాల వ్యవస్థ కల్పించకపోవచ్చుగానీ అయితే ప్రజలు సురక్షితంగా జీవనం, దేశ రక్షణ, డిజిటల్ టెక్నాలజీ విభాగాలలో సాంకేతిక సంబంధాలకు అనుసంధానంగా పని చేస్తోందన్నారు. అటవి, సముద్రంతోపాటు ప్రతి విభాగంలోనూ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసిందన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ కేపీజే రెడ్డి మాట్లాడుతూ విద్యను విభిన్నంగా చూసే విధానాన్ని పెంపొందింప చేసుకోవాలన్నారు. 2047 నాటికి భారత్‌ను సూపర్‌పవర్ దేశంగా చేసేందుకు యువత సిద్ధం కావాలన్నారు. డాక్టర్ బీవీ జగదీశ్ మాట్లాడుతూ ఇస్రో మాజీ చైర్మన్ కిరణ్‌కుమార్ ఇక్కడి విద్యార్థిగా చెప్పుకోవడం గర్వకారణమన్నారు. ఎన్‌ఈఎస్ కార్యదర్శి వెంకటశివారెడ్డితోపాటు రాష్ట్ర కార్యదర్శి అరుణ్‌కుమార్, తల్లం ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.


విజ్ఞానమేళాలో ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ టీకే అనురాధ

చలి వేకువ



బతుకు బండి

అనంత శివారు: వృక్ష సంపదకూ వణుకు.. చలికాలం మరి..!







అనంత రైల్వే స్టేషన్: కదలక మెదలక.. కనుచూపు మేరలో రైలు కనిపించక..

పలకరించకు నన్ను
గజ గజా వణికే చలిలో..!
పెదవి పెగలదు నువ్వెంత పిలిచినా..!
తెలతెలవారే వేళ..
మంచు తెమ్మరలు కమ్మేశాయి..
హిమ బిందువులు..
చలిలో కలిసి సూదుల్లా పొడుస్తున్నాయ్..!
నగరం పొగచూరిన వేళ..
పలకరించకు నన్ను..!
ఉబ్బసం లేకపోయినా..
ఊపిరి అందడం లేదు..!
భయపడకపోయినా..
వణుకు ఆగడం లేదు..!
పలకరించకు నన్ను..!



అనంత హైవే: చలికాల మహిమ..!
మండే సూరీడు.. నిండు చందురుడిలా..!

శాగబారిన మనిషీ వణికిపోతున్నాడు.. ఏం చలిరా బాబూ..!

గ్రంథాలయ ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక



కొత్త కార్యవర్గ సభ్యులు

అనంతపురం విద్య, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం కొత్త కార్యవర్గం ఎంపిక చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం అధ్యక్షతన శుక్రవారం ఎన్జీవో హోంలో సమావేశం నిర్వహించారు. గతంలో ఉన్న జిల్లా అడ్‌హక్ కమిటీని రద్దు చేసి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కటిక జయరాం, సహాధ్యక్షులుగా కృష్ణ, రమేష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొజ్జేనాయక్, సహాయ కార్యదర్శిగా ఇబ్రహీం, ట్రెజరర్‌గా శ్రీనివాసులు, కార్యవర్గసభ్యులుగా వెంకట రమణప్ప, మల్లికార్జున, నల్లమ్మ, మహిళా కార్యదర్శులుగా ముత్యాలమ్మ, ఉషారాణి, శాంతమ్మ, ఉజ్జనేశ్వరి, నాగరాజును ఎంపికచేశారు. వారితో రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబ్జి, కన్వీనర్ తోకల రాంబాబు, ఇతర నేతలు పాల్గొన్నారు.

రెండు స్వచ్ఛంద సంస్థలకు జాతీయ అవార్డులు



అవార్డు అందుకుంటున్న సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్, ఫార్మ్ వేదా సంస్థ ప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్, ఫార్మ్‌వేదా స్వచ్ఛంద సంస్థలకు జాతీయ స్థాయి అవార్డులు దక్కాయి. వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, రైతుల జీవనోపాధుల పెంపునకు ఈ సంస్థలు కృషి చేస్తున్నాయి. వీటి సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ సోషల్ అండ్ బిజినెస్ ఎంటర్‌ప్రైజెస్ రెస్పాన్సిబుల్ (సబేరా) అవార్డుకు ఎంపిక చేశారు. దేశరాజధాని ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన సబేరా అవార్డుల ప్రదానోత్సవంలో సీసీడీ ప్రాజెక్ట్ మేనేజర్లు నటరాజ్, శంకర్, విఠల్‌రావు, ఫార్మ్‌వేదా సంస్థ సీఈఓ కౌశల్ అవార్డులు అందుకున్నారు. సీసీడీ వ్యవస్థాపకుడు త్రిలోచన్ శాస్త్రి మేనేజర్లను అభినందించారు.

ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడటమే లక్ష్యం

■ డీఆర్ఎం విజయకుమార్



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్ఎం విజయ కుమార్

గుంతకల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విపత్తులు, ప్రమాదాలు సంభవించినప్పుడు వీలైనన్ని ఎక్కువ ప్రాణాలను కాపాడటానికి సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) సభ్యులు కృషి చేయాలని డీఆర్ఎం విజయకుమార్ పేర్కొన్నారు. సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ వార్షికోత్సవంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే, సదరన్ రైల్వే జోన్ల పరిధిలో తర్ఫీదు పొందిన రైల్వే ఉద్యోగుల సదస్సును గుంతకల్లు డివిజన్ హెడ్‌క్వార్టర్సులోని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. సీడీఓ సభ్యులు చెన్నైలో ప్రదర్శించిన మాక్ డ్రిల్ విన్యాసాలను వీడియో ప్రజెంటేషన్ నిర్వహించారు. అనంతరం ప్రతిభచాటిన సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ సభ్యులకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, దక్షిణ మధ్య రైల్వే డీజీఎం ఉదయనాథ్ కోట్ల, ఏడీజీఎం కేఎల్ఎన్ స్వామి, సీనియర్ సీడీఐ టీ సుధీర్ బాబు, సదరన్ రైల్వే ఏడీజీఎం చెలియన్, సీనియర్ సీడీఐ చిట్టమల్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్బిటార్ పరీక్షల్లో గోవిందరాజులు ఉత్తీర్ణత

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చదరంగసమాఖ్య, అఖిలభారత చదరంగ సమాఖ్యలు సంయుక్తంగా శుక్రవారం రాజమండ్రిలో నిర్వహించిన సీనియర్ నేషనల్ ఆర్బిటార్ పరీక్షల్లో అనంతపురానికి చెందిన కోచ్ గోవిందరాజులు ఉత్తీర్ణత సాధించారు. నేషనల్, ఇంటర్నేషనల్ చెస్ పోటీలకు గోవిందరాజులు ఆర్బిటార్‌గా పనిచేసే అవకాశం వస్తుంది.



↑ గోవింద రాజులు ↑



తోటలోనే ఎర్రగా మాగిపోయిన టమోటా

నాలుగు రోజుల్లోనే ధరను తగ్గించేశారు

నాకున్న మూడు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశారు. నాలుగు రోజుల కిందట 16 కిలో ల టమోటా బాక్స్ ధర రూ.800 లకు అమ్ముడుపోయింది. ఆ ధర ఇప్పుడు కేవలం రూ. 100లకు పడిపోయింది. ఇలా ధర ఒక్కసారిగా పడిపోవడంతో ఆందోళన చెందుతున్నాం.

- రామాంజనేయులు, టమోటా రైతు, మేళ్లకుంట







ఒకే చోట కుప్పగా పోసిన టమోటా

కుప్పకూలిన టమోటా ధరలు

- 16 కేజీల బాక్స్ రూ.20 నుంచి రూ.200
- కొన్ని రోజుల కిందట బాక్స్ రూ.800
- నాలుగైదు రోజుల్లోనే తలకిందులైన ధరలు

ఆశలు అథఃపాతాళానికి..

కళ్యాణదుర్గం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు రైతుల ఆశలతో దోబూచులాడుతున్నాయి. ధర బాగుంది కదా అని సాగు చేస్తే పంట చేతికందేలోపు అథఃపాతాళానికి చేరుతున్నాయి. కూలీల ఖర్చు కూడా గిట్టుబాటు కావడం లేదు. దీంతో పలువురు రైతులు తోటల్లోనే టమోటాలను పశువుల మేతగా వదిలేసే దుస్థితి నెలకొందని వాపోతున్నారు. మొన్నటి వరకు అనంతపురం, కర్ణాటక(కోలార్), మదనపల్లి మార్కెట్‌లో 16 కిలోల టామోటా బాక్స్ రూ.800లు పలికింది. అదే ప్రస్తుతం రూ. 20 నుంచి రూ. 200ల మధ్య నడుస్తోంది. ఏ1 గ్రేడ్ టమోటాలు మాత్రమే బాక్స్ రూ. 200లు ధర పలుకుతోంది. ఈ ధరలు ఇంకా తగ్గే అవకాశాలు ఉన్నట్లు మార్కెట్ వర్గాల సమాచారం. టమోటా ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో సుమారు 487 ఎకరాలకు పైబడి టమోటా పంటను సాగు చేశారు. ఎకరాకు రూ.లక్ష ఖర్చు చేసి, ఒక్కొక్క రైతు సరాసరి రెండున్నర ఎకరాలకు పైబడి సాగు చేశారు. టమోటా పంటలన్నీ కోతకు వస్తున్న సమయంలో ఇలా ధరలు పడిపోవడంతో నష్టాలు తప్పవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు తగ్గుముఖం పట్టడానికి కారణాలు అర్థం కావడం లేదు. టమోటాను మొన్నటివరకు కొనేందుకు వ్యాపారులు ఎగబడ్డారు. ధరలు బాగుంటాయన్న ఆశతో విపరీతంగా రైతులు టమోటాను సాగు చేశారు. కానీ ఆశలు ఫలించడం లేదు.



టమోటాను తొలగిస్తున్న కూలీలు



పెట్టుబడి కూడా చేతికిరాదు

నేను మూడు ఎకరాల్లో టమోటా సాగు చేశా. సుమారు రూ. 3 లక్షలదాకా పెట్టుబడి పెట్టా. 16 కిలోల టమోటా బాక్స్ మొన్నటివరకు ఏడెనిమిది వందల రూపాయాల మధ్య ఉండేది. అదే ధర ఇప్పుడు రూ.20కి పడిపోయింది. దీంతో పెట్టుబడి కూడా చేతికి రాని పరిస్థితి నెలకొంది.

-నరేష్, టమోటా రైతు, ఒంటారెడ్డిపల్లి



తోటల్లోనే వదిలేసే పరిస్థితి

ధరలు భారీగా తగ్గడంతో టమోటాను తోటల్లోనే వదిలేసే పరిస్థితి నెలకొంది. నాలుగైదు రోజుల్లోనే ధరలు ఇలా తలకిందులైతే పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి కనబడటం లేదు. మరికొన్ని రోజులు ధరలు ఇలాగే ఉంటే భారీ నష్టాలు మూటగట్టుకోవాల్సిందే.

- రవి, టమోటా రైతు, ఒంటారెడ్డిపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి

ఈ సారైనా టమోటాతో గట్టెక్కవచ్చునన్న ఆశతో పంట సాగు చేస్తే.. ధరలు భారీగా తగ్గిపోయాయి. టమోటా బాక్స్ రూ.20 అంటే నష్టాలు ఎదుర్కోక తప్పదు. అందుకోసమే టమోటా పంటను సాగు చేయాలంటే భయపడే పరిస్థితులు వచ్చాయి. టమోటా రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

-రామాంజి, టమోటా రైతు, మేళ్లకుంట



మార్కెట్‌కు తగ్గిన కాయలు

అనంతపురంరూరల్: కక్కలపల్లి మార్కెట్‌లో టమోటా ధరలు పతనమయ్యాయి. స్థానిక మార్కెట్ నుంచి ఎగుమతి అయ్యే ప్రాంతాల్లో టమోటా దిగుబడులు అధికంగా వస్తుండటంతో ఇక్కడి టమోటకు డిమాండ్ తగ్గి, ధర పతనమైనట్లు సమాచారం. కొన్నిరోజులుగా నిలకడగా ఉన్న ధరలు గత నాలుగైదు రోజుల నుంచి భారీగా పడిపోయాయి. గతంలో ఓమాదిరి కాయలు, మచ్చలు ఇతరత్రకాయల సైతం మంచి ధర పలికాయి. కిలో గరిష్ఠంగా రూ.30 నుంచి రూ.40మధ్య పలికాయి. కనిష్ఠ ధరలు సైతం రూ.20 నుంచి 30మధ్య ఉన్నాయి. ప్రస్తుతం కాయల నాణ్యత బాగున్నప్పటికీ ధర లేకపోవడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌కు కాయలు కూడా అంతంత మాత్రంగానే వస్తున్నాయి. గతంలో పదిహేను వందల నుంచి 2వేల టన్నుల వరకు వచ్చేవి. ప్రస్తుతం 700 నుంచి 12వందల టన్నుల మధ్య వస్తున్నాయి. కాగా శుక్రవారం మార్కెట్‌కు 1125టన్నుల టమోటా వచ్చాయి. గరిష్ఠ ధర కిలో రూ.10, సరాసరి ధర రూ.6, కనిష్ఠ ధర రూ.4తో అమ్ముడుపోయాయి.



కసాపురంలో హనుమద్ వ్రతాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు

కన్నుల పండువగా హనుమద్ వ్రతం

పాల్గొన్న వేలాదిమంది భక్తులు

గుంతకల్లు, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): కసాపురం దేవస్థానంలో శుక్రవారం ఉదయం హనుమద్ వ్రతాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. హనుమద్ మండల, అర్ధ మండల దీక్షలను చేపట్టిన మాలధారులు గురువారం ఇరుముడులతో ఆలయానికి చేరిన సంగతి తెలిసిందే. ఉదయాన్నే ఆంజనేయ స్వామివారి మూల విరాట్టుకు అభిషేకాలు, ప్రత్యేక అలంకారాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపం వద్ద ఉన్న ఓపెన్ షెడ్‌లో వేదికను ఏర్పాటుచేసి, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని అక్కడ ఉంచి సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హనుమద్ వ్రతాన్ని నిర్వహించారు. మాలధారులు వేదిక ఎదుట భక్తి పారవశ్యంతో వ్రత కార్యక్రమాన్ని వీక్షించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబ సమేతంగా హనుమద్ వ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. తర్వాత వేద పండితులు, అర్చకులు ఆనవాయితీని అనుసరించి దీక్షాపరులచే హనుమాన్ మాల విసర్జనగావించారు. వ్రతంలో ఉపయోగించిన హనుమాన్ కంకణాలు, ప్రసాదాల కోసం భక్తులు ఎగబడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ శ్రీనాథ్‌గౌడు, బీఎస్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హనుమద్ వ్రతంలో పాల్గొన్న మాలధారులు

ఎయిమ్స్‌లో అనంత మెడికో సత్తా



భానుప్రసాద్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

అనంతపురం టౌన్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన మెడికో దేశరాజధానిలో సత్తా చాటాడు. న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఎంసీహెచ్ ఇన్ యురాలజీ(పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సు)లో ప్రథమ ర్యాంకు సాధించాడు. గత నెలలో పరీక్షలు జరగగా గురువారం రాత్రి ఫలితాలు విడుదల చేశారు. ఇందులో అనంతపురానికి చెందిన భానుప్రసాద్‌యాదవ్ ప్రథమర్యాంకు సాధించాడు. భోపాల్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఈయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో పీజీ చదువుతూ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈయన తండ్రి ఆత్మకూరు మండలం ఎంఈఓ-2గా పనిచేస్తుండగా, తల్లి క్షీరజ అదే మండలంలోని తోపుదుర్తి జడ్పీ ఉన్నతపాఠశాలలో బయాలజీ టీచర్‌గా పని చేస్తున్నారు. తమ కుమారుడు జాతీయస్థాయిలో ప్రతిభ చాటడంతో ఆ తల్లిదండ్రులు పుత్రోత్సాహంతో పొంగిపోయారు.

జాతీయ చెస్ పోటీలకు నితీష్‌చౌదరి ఎంపిక



నితీష్‌చౌదరి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన నితీష్‌చౌదరి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల లేపాక్షిలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్-14 చెస్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభచాటిన నితీష్‌చౌదరి జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈ పోటీలను మహారాష్ట్రలోని నాందేడ్‌లో వచ్చే ఏడాది జనవరి 21 నుంచి నిర్వహించనున్నారు. నితీష్‌చౌదరిని ఇంటర్నేషనల్ చీఫ్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్‌నాయుడు అభినందించారు.

కుటీర పరిశ్రమలకు సబ్సిడీ

అనంతపురం అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఔత్సాహికులు, డ్వాక్రా మహిళా సంఘాలకు ఆహార శుద్ధి కుటీర పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు శుక్రవారం తెలిపారు. పీఎంఎఫ్ఎంఈ కింద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రాజెక్టు విలువలో లబ్ధిదారులు 10 శాతం భరిస్తే, 35 శాతం ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందన్నారు. మిలిగిన 55 శాతం బ్యాంకుల రుణం లభిస్తుందన్నారు. గరిష్ఠంగా రూ.10 లక్షల దాకా సబ్సిడీని వర్తింపజేస్తారన్నారు. వివరాలకు ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా రిసోర్స్ పర్సన్ హరీష్ సెల్ నెంబర్ 9676796974ను సంప్రదించాలని సూచించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

నోస్ట్రడామస్ (జయంతి)



ఫ్రెంచ్ దేశానికి చెందిన సిద్ధాంత కర్త, ఫిజీషియన్ 1503 డిసెంబరు 14న జన్మించారు. కాల జ్ఞానం తరహాలో రాబోవు సంఘటనలను ముందుగా ఊహించి 942 పద్యాలతో 'లెస్ ప్రొఫెసీస్' పుస్తకాన్ని రాశారు. ప్రపంచంలో జరిగే ప్రముఖ ఘట్టాలను ప్రస్తావించగా నిజమయ్యాయి. రచయిత, అనువాదకుడు, జ్యోతిష్య శాస్త్రజ్ఞుడిగా పేరొందారు. 1566 జూలై 2న కన్నుమూశారు.

బీకేఎస్ అయ్యంగార్ (జయంతి)




'పద్మవిభూషణ్' గ్రహీత బెళ్ళూరు కృష్ణమాచార్ సుందరరాజ (బీకేఎస్) అయ్యంగార్ 1918 డిసెంబరు 14న కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా బెళ్ళూరులో జన్మించారు. యోగాలో ఆయన ప్రవేశపెట్టిన ఆసనాలకు 'అయ్యంగార్ యోగా'గా వ్యవహరిస్తారు. ఆధునిక యోగా పితామహగా పేరొందిన తిరుమలై క్రిష్ణమాచార్య శిష్యుడు. గురువుకు తగ్గ శిష్యుడిగా యోగా గురువులలో ఒకరిగా పేరొందారు. యోగా, తత్వశాస్త్రాలపై పలు రచనలు చేశారు. పద్మశ్రీ, పద్మభూషణ్ తదితర పురస్కారాలు పొందారు. 2004లో టైమ్ మ్యాగజైన్ ప్రచురించిన ప్రపంచంలో వంద మంది ప్రభావశీలురులో ఒకరిగా చోటు పొందారు. 2014 ఆగస్టు 20న కన్నుమూశారు.

రాజ్ కపూర్ (జయంతి)



'ఛార్లీ చాప్లిన్ ఆఫ్ ఇండియన్ సినిమా'గా పేరొందిన 'పద్మభూషణ్ గ్రహీత రాజ్‌కపూర్ 1924 డిసెంబరు 14న పెషావర్ ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు సృష్టినాథ్ కపూర్. ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ కపూర్ కుమారుడు. తండ్రి బాటలోనే హిందీ సినీరంగంలో నటుడు, నిర్మాత, దర్శకుడిగా పేరొందారు. ఆసియా, యూరప్ ఖండాలలో సైతం ఆయన సినిమాలు ప్రజాదరణ పొందాయి. 3 జాతీయ, 11 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, ఇతర గౌరవాలు అందుకున్నారు. 'ఆవారా' సినిమా ఆయనకు ఎంతో పేరు తెచ్చింది. 1988 జూన్ 2న కన్నుమూశారు.

కొక్కొండ వెంకటరత్నం పంతులు (వర్ధంతి)



కొక్కొండ వెంకటరత్నం పంతులు 1842 మార్చి 14న గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. కవి, నాటక రచయిత, పత్రికా సంపాదకుడు, ఉపాధ్యాయుడు, సంగీతజ్ఞుడు. 'మహా మహోపాధ్యాయ' బిరుదు పొందిన ఆధునికాంధ్రులలో రెండో వ్యక్తి. 'ఆంధ్రభాషా జాన్సన్' గౌరవం అందుకున్నారు. 1871లో 'ఆంధ్రభాషా సంజీవిని' పత్రిక స్థాపించి 20ఏళ్లపాటు నడిపారు. చెన్నైలో ఆంధ్రులచే నడపబడిన తొలి పత్రిక ఇదే. 1915 డిసెంబరు 14న కన్నుమూశారు.

శ్యామ్ బెనగల్ (పుట్టినరోజు)




ప్రముఖ హిందీ నటుడు, దర్శకుడు 'పద్మభూషణ్' గ్రహీత శ్యామ్ బెనగల్ 1934 డిసెంబరు 14న సికింద్రాబాద్‌లో జన్మించారు. దర్శకుడు, స్క్రీన్ రైటర్‌గా పేరొందారు. 12వ యేటనే తండ్రి కెమెరాతో తొలి సినిమాను రూపొందించారు. 70కుపైగా డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిలిమ్స్ తీశారు. నసీరుద్దీన్‌షా, ఓం పురి, స్మితా పాటిల్, షబనా అజ్మీ, వంటి నటులను పరిచయం చేసిన ఆయనదే. దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డు, హిందీలో 7 సినిమాలకు జాతీయ పురస్కారాలు, హోమి జే భాభా ఫెలోషిప్ పొందారు.

విజయ్ అమృత్‌రాజ్ (పుట్టినరోజు)



టెన్నిస్ క్రీడాకారుడు 'పద్మశ్రీ' విజయ్ అమృత్‌రాజ్ 1953 డిసెంబరు 14న మద్రాస్‌లో జన్మించారు. క్రీడా వ్యాఖ్యాతగా, నటుడిగా రాణించారు. ఆయన సోదరులు ఆనంద్ అమృత్‌రాజ్, అశోక్ అమృత్ రాజ్‌లు అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారులు. 1973లో గ్రాండ్‌స్లామ్ ఈవెంట్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. 1974, 87లలో డేవిస్ కప్ టీమ్‌లో ఫైనల్స్‌కు చేరుకున్నారు. కెరీర్‌లో 16 సింగిల్స్, 13 డబుల్స్ టైటిల్స్ గెలుపొందారు. 2022లో లండన్‌లోని ఇంటర్నేషనల్ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేం గుర్తింపు పొందారు.

రానా దగ్గుబాటి (పుట్టినరోజు)




రానా దగ్గుబాటి 1984 డిసెంబరు 14న చెన్నైలో జన్మించారు. నటుడు, నిర్మాత, బుల్లితెరపైనా సత్తా చాటుకున్నారు. తెలుగు, తమిళ, మళయాళం, హిందీ భాషల సినిమాలలో నటించారు. 'బాహుబలి' సినిమాలో భళ్లాలదేవ పాత్రకు ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్నారు. 2006లో సైనికుడు సినిమాకు విజువల్ ఎఫెక్ట్స్‌గా నంది అవార్డు అందుకున్నారు. 70 సినిమాల దాకా విజువల్ ఎఫెక్ట్స్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. బుల్లితెరపై కొన్ని కార్యక్రమాలకు తానే హోస్ట్‌గా వ్యవహరిస్తూ తనదైన గుర్తింపు పొందారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతం

» ఆలయాల్లో విశేష హోమాలు, అలంకరణలు



శిడ్లఘట్టలో స్వామివారికి హారతి



గంగానగర్‌లోని బైలాంజనేయస్వామి



తమలపాకులతో అలంకరణ



వర్తూరులో ఊరేగింపునకు పచ్చజెండా



చిక్కబళ్ళాపుర ఆంజనేయస్వామి ఆలయంలో పాల్గొన్న భక్తులు



విజయపురలో అభయ వీరాంజనేయస్వామి

బెంగళూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం శుక్లపక్ష త్రయోదశిన హనుమద్వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగర వ్యాప్తంగా పలు ఆంజనేయ స్వామి ఆలయాలలో శుక్రవారం విశేషపూజలు, హోమాలు, అలంకరణలు కొనసాగాయి. మైసూరు రోడ్డు గాలి ఆంజనేయస్వామి, లాల్‌బాగ్ గుట్ట ఆంజనేయస్వామి, జయనగర్‌లోని రాగిగుడ్డ దేవాలయం, గిరినగర్‌లోని కార్యసిద్ధి ఆంజనేయస్వామి, ఇలా సీతారామాంజనేయ ఆలయాలలోనూ విశేష పూజలు నిర్వహించారు. మరికొన్ని చోట్ల దత్తమాల ధారులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.

బైలాంజనేయస్వామికి పూజలు

శిడ్లఘట్ట: తాలూకాలోని మేలూరు - శిడ్లఘట్ట మార్గంలోని అప్పెగౌడనహళ్ళిగేట్ సమీపాన అనాదికాలంగా వెలిసిన బైలాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం హనుమద్వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. ప్రధాన అర్చకులు మురళిస్వామి, బృందం నేతృత్వంలో హోమాలు, అభిషేకం, అలంకరణ నిర్వహించారు. విశేషపూజల్లో చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పాల్గొని స్వామికృపకు పాత్రులయ్యారు. భక్తులకు తీర్థప్రసాదాల అనంతరం మధ్యాహ్నం అన్నదాసోహం నిర్వహించారు.

చౌడసంద్రలో...

శిడ్లఘట్ట నుంచి బెంగళూరు మార్గంలో రెండు కిలోమీటర్ల దూరంలోని చౌడసంద్ర గ్రామంలో కొలువైన 800 సంవత్సరాల క్రితం కుమార వ్యాసరాయన కాలంలో నిర్మించిన చారిత్రాత్మక ఆంజనేయస్వామి ఆలయంలో హనుమద్వ్రతం పూజలు ఘనంగా నిర్వహించారు. వీరాంజనేయస్వామికి పంచామృతాభిషేకం, హోమం, పూర్ణాహుతి, అలంకార సేవలు నిర్వహించారు. మహా మంగళారతి అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

చేళూరులో..

చేళూరు: చేళూరు తాలూకాలోని ఆంజనేయస్వామి ఆలయాలలో శుక్రవారం విశేషపూజలు, అలంకరణలు కొనసాగాయి. కొన్ని చోట్ల పంచామృతాభిషేకం అనంతరం తమలపాకులతో విశేషపూజ నిర్వహించారు.

మహదేవపురలో..

మహదేవపుర: వర్తూరు గ్రామంలోని శక్తాంజనేయ ఆలయంలో స్వామివారికి శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. అనంతరం వర్తూరు పురవీధులలో ఆంజనేయ స్వామి భారీచిత్రపటానికి ఊరేగించారు. హిందూ సంఘాల ప్రముఖుడు మహేంద్రమోది మాట్లాడుతూ హనుమజ్జయంతి, హనుమద్వ్రతం వంటి కార్యక్రమాలను అర్థవంతంగా ఆచరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మనోహరరెడ్డి, వర్తూరు శ్రీధర్, చిక్కణ్ణ, సత్యవెంకటేశరెడ్డి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు. వందలాదిమంది భక్తులకు అన్నదాసోహం నిర్వహించారు.

దొమ్మసంద్రలో...

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి దొమ్మసంద్రలోని పురాతనమైన కోడి వీరాంజనేయస్వామికి శుక్రవారం పాలు, శ్రీగంధం, పన్నీరు. పసుపు. కుంకుమలతో అభిషేకం నిర్వహించి అలంకరణ చేశారు.



వీరపల్లిలో వెన్న అలంకరణలో అభయాంజనేయస్వామి

విశేషపూజల అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కోడి వీరాంజనేయస్వామి సేవా ట్రస్టు, పుట్టప్ప, లక్ష్మమ్మ కుటుంబీకులచే అన్నదానం నిర్వహించారు.

చింతామణిలో...

చింతామణి: చింతామణి పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా వివిధ ఆలయాలలో హనుమద్వ్రతం పురస్కరించుకుని విశేషపూజలు, విద్యుద్దీపాలంకరణ, భక్తులకు అన్నదానం నిర్వహించారు. నారసింహపేటలోని వీరాంజనేయస్వామి ఆలయంలో విశేషపూజల్లో మంత్రి సుధాకర్ సోదరుడు మునిశామిరెడ్డి, నగరసభ అధ్యక్షుడు ఆర్ జగన్నాథ, నగర యోజనా ప్రాధికార అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, నగరసభ సభ్యులు, మాజీ సభ్యులు పాల్గొన్నారు. రాఘవేంద్రస్వామి ఆటోస్టాండ్ ఆలయం లోనూ, కోటగల్ పంచాయతీ పరిధిలోని వీరప్పల్లి గ్రామం అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఆరో వార్షిక ఉత్సవాలు నిర్వహించారు. కొన్నిచోట్ల స్వామివారికి సింధూర అలంకరణ చేశారు. కన్నంపల్లిలోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలోనూ, వరదాద్రి కొండపైగల వరదాంజనేయస్వామికి వజ్ర కన్నుల అలంకరణ చేశారు. కొండపై వేరుశనగ పరుష నిర్వహించారు. నగరసభ కమిషనర్ చలపతి నేతృత్వం వహించి పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ వాడరాదని భక్తులకు అవగాహన కల్పించారు. ఇలా తాలూకా వ్యాప్తంగా విశేషపూజ కార్యక్రమాల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో పట్టణ, గ్రామీణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



దొమ్మసంద్రలో విశేషపూజల్లో పాల్గొన్న భక్తులు

విజయపురలో...

విజయపుర: దేవనహళ్ళి తాలూకాలోని విజయపుర పట్టణంలో హనుమద్వ్రతం వేడుకలు సంబరంగా సాగాయి. దేవనహళ్ళి రోడ్డులోని బసవేశ్వరబస్టాండ్ సమీపానగల అభయ వీరాంజనేయస్వామి ఆలయంలో 15 అడుగుల ఎత్తైన స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. హోమాల అనంతరం భక్తాదులకు అన్న సంతర్పణ నిర్వహించారు.



బెంగళూరు యూనివర్సిటీ గుట్టె ఆంజనేయస్వామి

ఉత్సాహంగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

» రామయ్య యూనివర్సిటీలో విజేతలకు బహుమతుల ప్రదానం



స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వేదికపై చాన్సలర్ డాక్టర్ ఎంఆర్ జయరాం తదితరులు

బెంగళూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రామయ్య యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్స్ సాఫ్ట్‌వేర్ రంగానికి సంబంధించి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024 ఉత్సాహంగా సాగింది. ఫైనల్ పోటీలు మరింత ఉత్కంఠ అనిపించాయి. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఢిల్లీతోపాటు 14 రాష్ట్రాలకు చెందిన ప్రతిష్టాత్మక విద్యాసంస్థలనుంచి విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. ఆవిష్కరణల సాధనలకు సంబంధించి జలశక్తి మంత్రిత్వ కార్యాలయం సమస్యలను సూచించింది. విద్యార్థుల బృందాలు భిన్నమైన రీతులలో హ్యాకథాన్ నిర్వహించారు. రామయ్య యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ ఎంఆర్ జయరాం, ఏఐసీటీఈ సలహాదారులు డాక్టర్ ఎస్‌హెచ్ సిద్దలింగస్వామి, యూఆర్‌రావ్ ఉపగ్రహకేంద్రం శాస్త్రవేత్త జీవన్‌కుమార్ పండిట్, ఉపకులపతి కులదీప్‌రైనాలు పాల్గొన్నారు. రెండు రోజుల హ్యాకథాన్ శుక్రవారం ముగిసింది. ఫైనల్ పోటీలలో టీమ్‌టెక్ వేవ్, టీమ్ డ్రాప్ స్క్వాడ్, టీమ్ అక్సిలు విజేతలుగా నిలిచారు. ఈ మూడు బృందాలకు లక్ష రూపాయల బహుమతి అందించారు. టీమ్‌టెక్ వేవ్‌లో భోపాల్‌కు చెందిన ఐఈఎస్ ఇంజనీరింగ్ కళాశాలబృందం ఆయుష్‌రాజ్, హిర్దేశ్ మేవాడ, భావనాగుప్త, అభినవ్‌కుమార్, అర్థవ్‌సింగ్, నితీశ్‌కుమార్‌లు ఉన్నారు. ఇక టీమ్ డ్రాప్ స్క్వాడ్‌లో శివాజీరావ్ జోందాల్ ఇంజనీరింగ్ కళాశాల సోనార్‌వాడ విద్యార్థులు ఆకాంక్ష రవీంద్రభగత్, హర్షాలి అనిల్‌వని, అన్మోల్ సంతోష్ మహంతి, సార్థక్ ప్రవీణ్‌తివాడ్, అక్షయ్‌రాజన్ కాంబ్లి, ఓంకార్ విశ్వజిత్ కదంబ్ ఉన్నారు. మరో బృందం ఉజ్జయినిలోని అవంతికా యూనివర్సిటీ అకార్డ్‌సుఖి బృందంలో సాత్విక్‌రావ్, భక్తిడాంగ్రి, రియారంజన్, గౌరవ్ ఓజా, హర్షల్‌మోది, గర్విన్‌పాండ్యలు ఉన్నారు.



డ్రాప్ స్క్వాడ్‌కు నగదు బహుమతి

రేపు సహజయోగా శిక్షణ

బెంగళూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): 'సహజయోగా మహాయోగా' పేరిట ఆదివారం నగరంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంగణంలో యోగాపై శిక్షణలు ఇవ్వనున్నారు. సహజయోగా సంస్థ మాతాజీ నిర్మలాదేవి మార్గదర్శకంలో ఏర్పాటైంది. యోగాకు సంబంధించి సమాచారంతోపాటు యోగాద్వారా ఎటువంటి ఆరోగ్య విధానాలు మెరుగవుతాయనేది తెలపనున్నారు. ధ్యానం అనేది మానసిక, శారీరకంగానే కాకుండా ఆధ్యాత్మిక సాధన కూడా. ఇదే సందర్భంలోనే సంగీత కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ధనంజయ ధమాల్, సితార్ విద్వాంసులు డాక్టర్ జయంతకుమార్‌దాస్, నృత్యకారిణి ప్రీతిసండూరు, వేణు విద్వాంసులు శక్తిధార్, రాజేంద్రసింగ్ పవార్, హార్మోనియంపై వికాస్ జైస్వాల్‌లు సహకారం అందించనున్నారు. ముఖ్య అతిథులుగా పులకేశినగర్ ఏసీపీ సీఆర్ గీతా, నటి రూపా అయ్యర్, సంగీత దర్శకురాలు మానసహొళ్ళ, నటి రాధికా నారాయణ్ పాల్గొననున్నారు. సాయంత్రం 4 నుంచి 8వరకు జరుగనున్నాయి.

లోక్ అదాలత్‌లో ఒక్కటైన దంపతులు



మళ్లీ ఒక్కటైన దంపతులకు అభినందన

బాగేపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలు ఇతరత్రా కారణాలతో విడిపోయిన దంపతులు లోక్‌అదాలత్ ద్వారా మళ్ళీ ఒక్కటయ్యారు. పట్టణంలోని కోర్టులో ఈనెల 14న అదాలత్ జరగాల్సి ఉండగా శుక్రవారం ప్రత్యేక వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా సివిల్ న్యాయాధికారి భారతి నేపథ్యంలో దంపతులు మళ్ళీ ఒక్కటి కావడంపై హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదుల సంఘం ఏ నంజుండప్ప మాట్లాడుతూ కక్షిదారులు ఎంతోకాలంగా ఎదుర్కొన్న కేసులను పరిష్కరించేలా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుని రాజీ చేసు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా న్యాయవాది చిన్నస్వామి, నాగభూషణ్, ముస్తాక్ అహ్మద్, అల్లాబక్ష్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న జయశంకర్ తదితరులు

బెంగళూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పుస్తకపఠనం ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవాలని బ్రిగేడ్ ఫౌండేషన్ ట్రస్టీ ఎంఆర్ జయశంకర్ అభిప్రాయపడ్డారు. ఆర్‌వి యూనివర్సిటీ బెంగళూరు క్యాంపస్‌లో అత్యాధునిక సౌలభ్యాలతో లైబ్రరీ బై బ్రిగేడ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. మైసూరు క్యాంపస్‌లో బ్రిగేడ్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మద్దతు ఇచ్చేలా ఆధునిక గ్రంథాలయానికి ప్రాధాన్యత ఇచ్చినట్టు జయశంకర్ తెలిపారు. బ్రిగేడ్ స్కూల్స్ ప్రారంభించిన రెండు దశాబ్దాలలో ఎన్నో మార్పులు తీసుకొచ్చామన్నారు. ఆర్‌వీ యూనివర్సిటీ కులపతి ఏవీఎస్ మూర్తి మాట్లాడుతూ ఉన్నతవిద్య గుణాత్మకంగా మారాలంటే తగిన సౌలభ్యాలు ఉండాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ట్రస్టీ చైర్మన్ డాక్టర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య విద్యాసంస్థల డీన్‌పై దాడి

» ఆసుపత్రిలో మృతి



మనోహర్ రెడ్డి (ఫైల్)

బెంగళూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎలక్ట్రానిక్‌సిటీ విభాగం చైతన్య విద్యాసంస్థల డీన్ మనోహర్ రెడ్డి (55)పై దాడి జరగడంతో ఆసుపత్రి పాలైన ఆయన మృతిచెందారు. ప్రకాశం జిల్లా అద్దివీడుకు చెందిన మనోహర్‌రెడ్డి కొన్నేళ్లకాలంగా చైతన్య విద్యాసంస్థలలో అధ్యాపకుడిగా పనిచేస్తు న్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటినుంచి కళాశాలకు వచ్చే సమయంలో ఎదురుగా ఎక్స్‌కవేటర్ రోడ్డుగా అడ్డు ఉండేది. ఈ విషయమై స్థానికుడి వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరువురూ పరస్పరం దూషించుకున్న వేళ దాడి జరిగినట్టు తెలుస్తోంది. కాసేపటి తర్వాత చైతన్య విద్యాసంస్థల ఏఓ, ప్రిన్సిపాల్‌కు సమాచారం చేరింది. వారు అక్కడికి చేరుకునేందుకు ప్రయత్నించారు. ఈలోగా తాను కళాశాలకు వస్తున్నానని, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయదలచినట్టు మనోహర్‌రెడ్డి తెలిపారు. మార్గమధ్యలోనే కుప్పకూలడంతో స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించారు. అయినా చికిత్సలు ఫలించక మృతి చెందాడు. ఈమేరకు హెబ్బగూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

కీలక సంస్థల ఒప్పందం

బెంగళూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మెసర్టి, వీఎస్‌టీ గ్రూప్‌లు సంయుక్తంగా ఇటాలియన్ విలాసవంతమైన కార్లను మార్కెటింగ్ చేసేందుకు ఒప్పందం చేసుకున్నాయి. నగరంలో శుక్రవారం వీఎస్‌టీ గ్రూప్ సీఎండీ అరుణ్‌సురేంద్ర, మెసర్టి ఓవర్సీస్ రీజియన్ హెడ్ ఫిలిప్ క్లావరూల్‌లు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఫిలిప్ క్లావరూల్ మాట్లాడుతూ బెంగళూరులో కొత్త డీలర్‌షిప్ వీఎస్‌టీ గ్రూప్ ద్వారా శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిష్టాత్మకమైన బ్రాండ్లను ప్రజలకు సరళీకృతంగా అందేలా చేయడమే మా లక్ష్యమన్నారు. అరుణ్‌సురేంద్ర మాట్లాడుతూ దక్షిణభారత్‌లో విలాసవంతమైన వాహనాల మార్కెట్‌లో ఓ భారీ మార్పుకు వేదిక ఏర్పాటైందన్నారు. వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలోనే మెసర్టి సర్వీస్ సౌలభ్యం కూడా అందుబాటులోకి రానుందన్నారు.

ప్రయోగం పేరిట డ్రోన్ ప్రతాప్ అతి

» పోలీసుల అదుపులో ఇద్దరు

బెంగళూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్రోన్‌లు సొంతంగా తయారు చేశానని తద్వారా ఎన్నో ప్రయోగాలు సాధ్యమయ్యాయని ప్రచారం చేసుకుని కొన్నేళ్లక్రితం భంగపడిన డ్రోన్ ప్రతాప్ మరోసారి పీకల్లోతు కష్టాలు ఎదుర్కొన్నాడు. కొత్త ప్రయోగం పేరిట అతి ప్రవర్తనతో పోలీసుల చెరకు చేరాడు. రసాయనాలతో పేలుడుకు కారణమైన డ్రోన్ ప్రతాప్‌ను అరెస్టు చేసిన పోలీసులు సంఘటనా స్థలానికి పంచనామా కోసం శుక్రవారం తీసుకొచ్చారు. తుమకూరు జిల్లా మధుగిరి తాలూకా చినకలూటి గ్రామం రాయల బృందావన ఫాం హౌస్ వద్దకు డ్రోన్ ప్రతాప్‌ను తీసుకొచ్చిన పోలీసులు పరిశీలన జరిపారు. వ్యవసాయ కుంటలో నీటిలో పేలుడు జరిపి అందుకు సంబంధించిన వీడియోలను యూట్యూబ్‌లో షేర్ చేశారు. వీడియో ఆధారంగా పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి ప్రతాప్‌తోపాటు మరో ఇద్దరిని గురువారం అరెస్టు చేశారు. శుక్రవారం పంచనామా కోసం తీసుకొచ్చారు. భూ యజమాని జితేంద్ర జైన్‌తోపాటు డ్రోన్ ప్రతాప్‌లపై మిడిగేసి పోలీసులు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.



పంచనామాలో పోలీసులు

బాల్యవివాహం.. నలుగురిపై కేసు

బంగారపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దొడ్డపొన్నాండహళ్ళిలో బాల్య వివాహ ఘటనకు సంబంధించి నలుగురిపై కామసముద్ర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బంగారపేట పట్టణంలోని గంగమ్మనపాళ్యకు చెందిన బాలికతో వారంక్రితం దొడ్డపొన్నాండ హళ్ళికి చెందిన రమేశ్ (35)తో వివాహం జరిగింది. ఇందుకు సంబంధించి హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు రావడంతో అధికారులు స్పందించి ఆరా తీశారు. బాలిక చదువుతున్న పాఠశాలకు వెళ్ళి జనన ధ్రువీకరణను నిర్ధారించారు. ఈ మేరకు బాలిక తండ్రి, చిన్నాన్న, వరుడు, అతడి తండ్రిపై కామసముద్ర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీడీపీఓ మునిరాజు మాట్లాడుతూ బాల్యవివాహాలపై ప్రభుత్వం ఎంతగా జాగృతి చేపట్టినా ప్రయోజనం లేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. వధువుకు 18ఏళ్లు, వరుడికి 21ఏళ్లు ఉండి ఉండాలని స్పష్టం చేసినా పాటించడం లేదన్నారు. బాల్యవివాహాల గురించిన సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.31	1,591.06
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,909	520
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,832	1,786
నీటి నిల్వ (టీఎంసీలు)	91.50	11.94

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

బళ్లారి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రక్షణ కల్పించాలని పోలీస్‌స్టేషన్ వెళ్లిన మహిళను మోసగించిన పోలీసులపై సస్పెన్షన్ వేటు పడింది. శుక్రవారం ఎస్పీ శోభారాణి విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల మేరకు నగరానికి చెందిన ఓ మహిళ భర్త వేదింపులు తాళలేక కౌల్‌బజార్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. ఆ సమయంలో అక్కడ సయ్యద్ ఇమ్రాన్ అనే కానిస్టేబుల్ డ్యూటీలో ఉన్నారు. బాధితురాలు కానిస్టేబుల్‌కు తన సమస్యను వివరించింది. అయితే ఈ కేసు మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందని, అక్కడ ఫిర్యాదు చేయాలని చెప్పి పంపారు. మహిళతో ఫోన్ నెంబర్ తీసుకుని పంపించేశారు. మరుసటిరోజు నుంచి తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ నీకు ఏమి కష్టం వచ్చినా నేను ఉన్నాను.. అంటూ నమ్మబలికి ఆమెకు దగ్గరయ్యాడు. భర్త వేధింపులు తాళలేక పోతున్నానంటూ మహిళ తరచూ చెప్తుండంతో వేరే ఇంట్లో ఉండేలా ఏర్పాటు చేస్తానంటూ రూ. 15,000 డబ్బులు ఇచ్చి అద్దె ఇళ్లు ఏర్పాటు చేశాడు. తరచూ ఇంటికి వస్తున్న కానిస్టేబుల్ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. కానిస్టేబుల్ సయ్యద్ ఇమ్రాన్ బంధువు, ట్రాఫిక్ స్టేషన్‌లో పనిచేస్తున్న అజాద్ అనే కానిస్టేబుల్‌ను పరిచయం చేసేందుకు ఇంటికి తీసుకొచ్చాడు. వీరిద్దరూ తనను శారీరకంగా వాడుకుని, తనకు అన్యాయం చేశారని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు జిల్లా ఎస్పీ శోభారాణికి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లపై నిఘా పెట్టారు. విచారణలో దోషులుగా తేలడంతో వీరిద్దరనీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కొండపై చిరుత ప్రత్యక్షం

కంప్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని దేవలాపురం, కురేకుప్ప అడవుల్లో కొండపై బాటసారులకు చిరుత కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం సాయంత్రం జేఎస్‌డబ్ల్యూలో విధులు నిర్వహించుకుని వస్తున్న ఉద్యోగులకు దరోజీ కొండ పక్కనే బండరాయిపై చిరుత కనిపించచింది. దీంతో ఉద్యోగులు బెంబేలెత్తి పరుగులు తీశారు. ఈ ప్రాంతాల్లో తరచుగా చిరుతలు కనిపిస్తున్నాయి. రైతులు గానీ, జేఎస్‌డబ్ల్యూ ఉద్యోగులు గానీ తమ పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఇలాంటి ప్రదేశాల్లో ఫారెస్టు అధికారులు ప్రత్యేక హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవ్

● లోకాయుక్త అధికారి మహమ్మద్ రఫిక్

కంప్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని లోకాయుక్త అధికారి మహమ్మద్ రఫిక్ హెచ్చరించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలపై తక్షణం స్పందించాలన్నారు. హోస్పేట నుంచి బుక్కసాగర నుంచి కడేబాగిలు మీదుగా వెళ్లు బస్సు రవాణా చేపట్టే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. కంప్లికి వచ్చి గంగావతికి వెళ్లేలా వారికి సూచనలిస్తామన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఆర్ఓ ప్లాంటు ఏర్పాటు చేసి రోగులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, ఈవో శ్రీకుమార్, ముఖ్య అధికారి దుర్గన్న, ఏడీ మల్లన్న గౌడ, తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత ఫిర్యాదుల కమిటీతో మహిళలకు భద్రత

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి



విద్యార్థినులతో సమస్యలపై ఆరాతీస్తున్న చైర్‌పర్సన్

బళ్లారి సిటీ,డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా, తాలూకా స్థాయి లో అన్ని కార్యాలయాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని, వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న మహిళలకు దీనిపై అవగాహన కల్పించాలని కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి చౌదరి సూచించారు. కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్ జిల్లాపాలనాయంత్రాంగం, జిల్లాపంచాయతీ , మహిళా శిశు అభివృద్ధి శాఖ సంయుక్త ప్రాంగణంలో శుక్రవారం నూతన జిల్లా పాలనా భవన్ హాల్లో ఏర్పాటు చేసిన మహిళా ప్రగతి సమీక్ష సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మహిళలపై లైంగిక వేదింపుల చట్టం 2013న కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని,ఈ చట్టం ప్రకారం అన్ని ప్రైవేట్,ప్రభుత్వ కార్పోరేషన్ బోర్డుల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసి భద్రత కల్పించాలన్నారు. ఎస్పీ శోభారాణి బళ్లారి నగరంలో మహిళల భద్రత కోసం 'నవదుర్గ టీమ్' ప్రారంభించామని, ఏ సమస్య వచ్చినా తక్షణమే మహిళలు వారిని సంప్రదించవచ్చన్నారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాస్థాయి అధికారులు, అన్ని తాలూకాల తహశీల్దార్లు, పంచాయతీ ఈఓలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

ఆడపిల్లలు బాగా చదువుకుని, ఎలాంటి సమస్యలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలని చైర్ పర్సన్ ఉపాధ్యాయులకు సూచించారు. నగరంలోని కోటే ప్రాంతంలోని సెయింట్ జనఫ్రీ గ్రాడ్యుయేషన్ కళాశాల హాల్లో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సంవాద కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మహిళ భవిష్యత్తును నిర్ణయించేది విద్య, కాబట్టి బాలికలు ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి చదువుపై దృష్టిచారించాలన్నారు. బాలికలు బయటి ప్రపంచం గురించి సాధారణ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. యువత లక్ష్యంపై దృష్టి పెట్టి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలన్నారు. ఈసందర్భంగా మహిళా శిశు అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు విజయ్‌కుమార్, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి జలాలప్ప, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డా. రమేశ్‌బాబు, తహసీల్దార్ మేనేజర్ పాధర్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోండి

18ఏళ్ళు నిండిన యువత తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని చైర్‌పర్సన్ సూచించారు. జిల్లాపంచాయతీ, బళ్లారి తాలూకా పంచాయతీ, సంగనకల్లు గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటు నమోదు ప్రచార కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సుస్థిర అభివృద్ధి కోసం ఓటు వేసి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసుకునే అవకాశం రాజ్యాంగం కల్పించిందన్నారు. సమాన సమాజ నిర్మాణానికి సమానత్వం కీలకం, మహిళా సాధికారత కోసం ప్రతి ఆడబిడ్డ తప్పకుండా విద్యనభ్యసించాలన్నారు. ఈసందర్భంగా మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్, కుటుంబ సంక్షేమాధికారి రమేశ్‌బాబు, తహసీల్దార్ గురురాజ్, గ్రామ పంచాయతీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, సభ్యులు పాలకమండలి సభ్యులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బళ్లారిలోని బెంగళూరు రోడ్డులోని ఫోలాక్ జీన్స్ గార్మెంట్ ఫ్యాక్టరీని నాగలక్ష్మి సందర్శించి జీతం, పీఎఫ్ తదితర సమస్యలపై మహిళా ఉద్యోగులతో ఆరా తీశారు. ఈసందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి జలాలప్ప,చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు మహంతేశ్, యజమానులు కార్మికులు పాల్గొన్నారు.



నిరసనలో బీజేపీ బీసీ మోర్చా నాయకులు

కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలి

● బీజేపీ బీసీ మోర్చా నాయకుల డిమాండ్

బళ్లారి సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల కార్పోరేషన్లకు గ్రాంట్లు మంజూరు చేయాలని, లేని పక్షంలో వాటిని మూసివేయాలని బీజేపీ వెనుకబడిన తరగతుల మోర్చా డిమాండ్ చేసింది. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్పోరేషన్లకు నిధులు విడుదల చేయాలని, లేకపోతే అవి నిరుపయోగమన్నారు.నగరంలోని గడగి చెన్నప్ప సర్కిల్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి జిల్లాయంత్రాంగానికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంలో బీజేపీ జిల్లాధ్యక్షుడు అనిల్‌నాయుడు మాట్లాడుతూ అహింద పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం సిద్దరామయ్య వెనుకబడిన తరగతుల ప్రజల ఆర్థిక, వృత్తి, వ్యవసాయం, విద్యకోసం కార్పోరేషన్లకు నిధులు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. గతంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేవరాజ అరసు, ఒక్కలిగ, మరాఠా, విశ్వకర్మ, ఉప్పర, వీరశైవ లింగాయత్,నిజశరణ అంబిగర్ చౌడయ్య, సవితా సమాజ్ సంచార జాతులు, మడివాళా మాచిదేవయ్య తదితర వెనుకబడిన అభివృద్ధికి వెయ్యికోట్లకు పైగా నిధులు విడుదల చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బడ్జెట్‌లో రూ.1600కోట్లు ప్రకటించి కేవలం 57.04 కోట్ల రుపాయలు కేటాయించారన్నారు. వెనుకబడిన తరగతుల విద్యార్థుల విద్యా రుణాల కోసం ఒక్కపైసా కూడా విడుదల చేయలేదన్నారు. ఈసందర్భంగా కేఎంస్ అశోక్, హుమంతప్ప, మల్లన్‌గౌడ, మధు, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.


చిరుత దాడిలో ఆరు గొర్రెపిల్లల మృతి



గొర్రెపిల్లల కళేబరాలను చూపుతున్న పంపన్న

కంప్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని దరోజీ సోమలాపురం వద్ద గురువారం సాయంత్రం చిరుతదాడిలో ఆరు గొర్రెపిల్లలు మృతి చెందాయి. మరో ఏడు గొర్రెపిల్లలకు ఏడు గాయాలయ్యాయి. సోమలాపురం గ్రామానికి చెందిన ఎన్ పంపన్న గ్రామం పక్కన వున్న గంగమ్మ తోటలో గొర్రెల మందను ఆపారు. ఉదయం గొర్రెపిల్లలను ఒక షెడ్డులో వుంచి పంపన్న గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. సాయంత్రం ఎవరూ లేని సమయంలో చిరుత దాడి చేసింది. ఈ దాడిలో ఆరు గొర్రెపిల్లలు మృతి చెందగా, ఏడు గొర్రె పిల్లలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పంపన్న వెంటనే అక్కడకు చేరుకుని దిగ్భ్రాంతికి గురయ్యారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే చిరుత దాడి జరుగుతోందని, గతంలో ఇదే ప్రాంతంలో ఓ బాలుడిపై చిరుత దాడి చేసి హతమార్చిందన్నారు. ఇప్పటికైనా చిరుతను బంధించి అడవికి తరలించాలని కోరారు. గ్రామ పంచాయతీ సభ్యులు మారేష్ మాట్లాడుతూ ఎన్నోసార్లు గొర్రెల మందపై దాడి చేసి హతమార్చిందని ఈ యేడాది కూడా దాడులు కొనసాగుతున్నా యన్నారు. వెంటనే అధికారులు శ్రద్ద వహించి బోన్లు ఏర్పాటు చేసి వాటి నుంచి విముక్తి కల్పించాలని కోరారు.

అంజనాద్రిపై భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో అంజనాద్రి ఆంజనేయస్వామి



భక్తులకు మజ్జిగ పంపిణీ

బళ్లారి సిటీ/కంప్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): హనుమద్ అంజనాద్రి కొండపై హనుమద్ వ్రతం సందర్బంగా భక్తులు పోటెత్తారు. గురువారం తెల్లవారుజాము నుంచే హనుమాన్ మాల విసర్జన కార్యక్రమం జరిగింది. హనుమాన్ మాలధారులు గదగ్, కొప్పళ, హులుగి,హోస్పేట్, లింగాపూర్, పంపసాగర్, కంప్లి, కమలాపూర్, సండూర్, బళ్లారి, సింధనూరు, కారటగి, కనకగిరి నుంచి కాలినడకన అంజనాద్రిని చేరుకున్నారు. మాలధారులకు ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాటు చేశారు. అంజనాద్రి వెనుక వేదపాఠశాల సమీపంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి అధికారులతో కలిసి వంటల తయారీని పరిశీలించారు. అనతరం ఆయన మాట్లాడుతూ హనుమాన్ మాల విసర్జనకు ఈసారి సుమారు లక్ష మంది వస్తారని అంచనా వేస్తున్నామన్నారు.



కొండపై మాలధారుల సందడి



ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి

ఓటు హక్కు పై అవగాహన తప్పనిసరి

● జడ్పీ ప్లానింగ్ అధికారి డాక్టర్ రోణి

రాయచూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పౌరులందరికి సమానంగా అందజేసిన ఓటు హక్కు పై ప్రతియొక్కరికి స్పష్టమైన అవగాహన ఉండాలని జడ్పీ ప్లానింగ్ అధికారి డాక్టర్ టీ రోణి సూచించారు. శుక్రవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో జాతీయ ఓటు హక్కు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారి, ఓటు హక్కు పట్ల అవగాహన కలిగి ఉండడంతో పాటు ఓటు హక్కుకు ఉన్న బాధ్యతను తద్వార ఏర్పడే ప్రజాప్రభుత్వాల ఏర్పాట్లు ప్రజలు ముఖ్యంగా ఓటర్లు కీలక భాగస్వాములు కావాలన్నారు. ఓటు హక్కు సద్వినియోగం జరిగినప్పుడే నిజమైన ప్రభుత్వ ప్రజాప్రభుత్వాలు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో మాట్లాడిన జిల్లా విద్యశాక అధికారి కేటీ బడిగేరి విద్యార్థులు తాము ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులు ఇరుగు-పొరుగువారందరు విధిగా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తద్వార వ్యవస్థ బలోపేతంలో తాము భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రోణి

పాడి పరిశ్రమపై రైతులకు అవగాహన



శిక్షణ పొందిన వారికి రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వైద్యులు

కంప్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పశువైద్యశాలలో పాడి పరిశ్రమ పెంపకంపై సుమారు 60 మందికి వైద్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మసియన్న, అరణ్యకట్టి, డాక్టర్ బసవరాజు, మంజునాథ్ రెండు రోజుల పాటు పశువుల పెంపకం, కోళ్ళు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సదుపాయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. తాలుకాలోని ఎమ్మిగనూరు, జానూరు, నెల్లూడి, సన్నాపురం, రామసాగరం తదితర గ్రామాల్లో ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బసవరాజు, కట్టిమనె శివప్ప, దేవకి, ఆంజనేయులు, రామచంద్ర, ఉప్పాళప్ప తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు పనులు

బళ్లారి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని పీడీ హళ్లి వద్ద ఎన్‌హెచ్ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వంతెన పూర్తయితే వాహనదారులకు సౌకర్యం కానుందని గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కంటే పనులు వేగంగా చేపడుతున్నామని ఎస్‌ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు తెలిపారు.



పూర్తి కానున్న సీసీ రోడ్డు



తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన తాయమ్మదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు శ్రీనివాస అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహామంగళహారతి చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద పంపిణీ చేపట్టారు.

క్రీడలతో ఒత్తిడి దూరం: జడ్పీ సీఈఓ

రాయచూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఉపాదిహామి పనుల నిర్వహణలో తమ ప్రతిభను చాటిన ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనడం ద్వార వృత్తి పరంగా ఎదురైయ్యే ఒత్తిడిని జయించాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారామ్ పాండ్వే సూచించారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం ఉద్యోగుల సంక్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని మహాత్మగాంధీ స్టేడియంలో ఒక రోజు క్రీడాపోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించాన జడ్పీ సీఈఓ ఉపాధి హామీ పనుల నిర్వహణలో ముఖ్యంగా పని దినాల కల్పనలో రాష్ట్రంలోని రాయచూరు జిల్లా అగ్రభాగాన ఉండడం గర్వకారణమన్నారు. ఉద్యోగులు సిబ్బందిని ఆయన అభినందించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ సీఈఓ రాహుల్ తుకారామ్ పాండ్వే

హోసూరు జోన్

చంద్రచూడేశ్వర ఆలయంలో దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

హోసూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో కొండపై వెలసిన చంద్రచూడేశ్వర మరగతాంబ ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు. మార్గశిర శుక్లపక్ష త్రయోదశి రోజున తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో జ్యోతిని వెలిగిస్తారు. ఇదే తరుణంలో చంద్రచూడేశ్వర ఆలయంలోనూ దీపోత్సవం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ అధ్యక్షుడు నాగరాజు, కౌన్సిలర్లు పార్వతి కార్యక్రమంలో నాగరాజ్, కృష్ణవేణి రాజు, కుబేరన్, హేమకుమార్, ఆది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంల్లో ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంల్లో 100 మంది పోలీసుల భద్రతాసిబ్బంది పాల్గొన్నారు. దీపోత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మైక్రో ఫైనాన్స్ కంపెనీలపై ఫిర్యాదు

రాయచూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన రుణాల వసూలు కోసం అనుచితంగా ప్రవర్తిస్తున్న మైక్రో ఫైనాన్స్‌లను కట్టడి చేయాలని మాదిగ దండోరా, మాదిగ ఎస్సీ వర్గికరణ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేవారు. శుక్రవారం నగరంలోని జిల్లాధికారి కార్యాలయంలో ఈ మేరకు వారు ఫిర్యాదు చేశారు. పలు మైక్రో ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు సమయపాలన లేకుండా రుణాలు ఇచ్చిన వారి ఇంట్లకు వచ్చి వేదింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రాత్రివేళల్ల సహితం ఇళ్లవద్దకు వచ్చి అసభ్యంగా ప్రవర్తిస్తు అవమాన పరుస్తున్నారని కొన్ని సందర్భాల్లో ఇందుకు బాధ్యుతలుగా మిగిలిన మహిళలు ఆత్మహత్యలకు ప్రయత్నించిన సందర్భాలు కూడా ఉన్నాయని జిల్లాధికారి దృష్టికి తెచ్చారు. రుణాలు ఇచ్చిన కంపెనీలు ఆఫీసు సమయాలు తప్పా ఇతర సమయాల్లో ఇళ్లకు వెళ్లకుండా వారిగి తగిన ఆదేశాలు ఇవ్వాలన్నారు. రుణాలు చెల్లించేందుకు కొంత సమయం కావాలని కోరినా పట్టించుకోకుండా అనేక సందర్భాల్లో దుర్భాషలాడుతున్నారని చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



డీసీ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న పోరాట సమితి నాయకులు



భూమిపూజలో ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య

ఎమ్మెల్యే భూమిపూజ

హోసూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): హోసూరు పరిధిలో ఏడో వార్డు జేజే నగర్ ప్రాంతంలో 'మనకు మనమే పథకం ప్రాజెక్టు' క్రింద రూ.15 లక్షలతో శుద్ధతాగునీటి కేంద్రం పనులకు భూమి పూజ చేశారు. కన్నాయ్ నిరోలాక్ పెయింట్ కంపెనీ, హోసూరు పీపుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాగునీటి కేంద్రం చేపడుతున్నారు. దీంతో స్థానికంగా తాగునీటి సమస్య తీరనుంది. హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్యలు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తమిళవాసన్, కన్నాయ్ నిరోలక్ పెయింట్ కంపెనీ మేనేజర్, హోసూరు పీపుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, నగర సంస్థ అధ్యక్షుడు సెందిల్‌కుమార్, నగర కోశాధికారి త్యాగరాజన్, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ శ్రీనివాసులు, ఏడో వార్డు శాఖ కార్యదర్శి హరీశ్, జిల్లా ప్రతినిధి అళగరసన్, పశ్చిమ ప్రాంత కోశాధికారి నందగోపాల్, డీఎంకే కార్యవర్గ సభ్యులు శ్రీనివాసన్, గిరి, నాగరాజు, బాలాజీ, జెబాస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు...

హోసూరు నల్లూరు పంచాయతీ యూనియన్ మధ్య హనుమంత నగర్ పరిధిలో పేవర్‌బ్లాక్ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. డీఎంకే జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ సత్య పాల్గొని పనులను ప్రారంభించారు. హోసూరు యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, హోసూరు యూనియన్ డిప్యూటీ సెక్రటరీ నల్లూరు పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షురాలు శాంత వీరభద్రప్ప, హోసూరు కార్పొరేషన్ ఒకటో జోన్ చైర్మన్ రవి, హోసూరు కార్పొరేషన్ ఆరో వార్డు కౌన్సిల్ సభ్యులు మమతా సంతోష్, నల్లూరు పంచాయతీ కౌన్సిల్ సభ్యురాలు కవితా శ్రీనివాసులు పాల్గొన్నారు.

దినకరన్ అభిమానుల పూజలు

హోసూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అమ్మా మక్కళ్ మున్నేట్ర కజగం (ఏఎంఎంకే) పార్టీ జనరల్ సెక్రటరీ టీటీవీ దినకరన్ 62వ పుట్టినరోజును పురస్కరించుకుని అభిమానులు, కార్యకర్తలు శుక్రవారం పలు ఆలయాలలో పూజలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. హోసూరు-బెంగళూరు జాతీయరహదారి మారుతీ నగర్‌లోని అరుల్మిగి ముత్తుమారియమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మారేగౌడు, కృష్ణగిరి పశ్చిమ జిల్లా కోశాధికారి శివకుమురు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కేక్ కట్ చేసి ప్రజలకు మిఠాయిలు పంచి పెట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వసంత్‌కుమార్, సంతోష్, మహేంద్రన్, సింగారవేలు, ఇరవయ్యో వార్డు సెక్రటరీ కుమరేశన్, కార్యకర్తలు పాల్గొన్నారు.